# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
**& చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 21 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 21-4 -2025 | వెల : .రూ. 5.00




## నీతీశ్‌ది కుర్చీలాట

- అదో అవకాశవాద కూటమి
- పదవి కోసం నీతీశ్ కుమార్ పార్టీలు మారుతుంటారు
- బీహార్‌కు ఇస్తామన్న రూ.1.25 లక్షల కోట్ల ప్యాకేజీ హామీ ఏమైంది ఖర్గే

**న్యూఢీల్లీఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీహార్‌లో జేడీయూ, భాజపా సంకీర్ణ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. అదో అవకాశవాద కూటమి అని పేర్కొన్నారు. నీతీశ్ కుమార్ సీఎం కుర్చీ కోసం పార్టీలు మారుతుంటారని ఆరోపించారు. బీహార్‌లోని బక్సర్‌లో నిర్వహించిన పార్టీ సభలో పాల్గన్న ఖర్గే ఈ మేరకు -మిగతా 2 లో



## జపాన్‌లో తెలంగాణ రైజింగ్ బృందం

# బిజీబిజీ

### కితాక్యూషూలో రాష్ట్ర బృందం పర్యటన

- రెండు ప్రముఖ సంస్థలతో కీలక ఒప్పందాలు
- మురసాకి రివర్ మ్యూజియంతోపాటు ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌నూ సందర్శించిన రేవంత్ టీమ్.


**హైదరాబాద్ ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జపాన్‌లో పర్యటిస్తున్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. కితాక్యూషూ నగరాన్ని సందర్శించింది. నగర మేయర్ కజుహిసా టకేచీని తెలంగాణ బృందం కలిసింది. ఈ సందర్భంగా అక్కడి సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో -మిగతా 2 లో



## రాష్ట్రంలో మరో రెండురోజులు వర్షం

- వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో మరో రెండు రోజులు వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నగరంతోపాటు సమీప ప్రాంతాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి, -మిగతా 2 లో



## యెమెన్‌పై అమెరికా బాంబుల వర్షం..

### 50 లక్ష్యాలు ధ్వంసం.. 80 మంది మృతి

**యెమెన్ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యెమెన్ పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. అమెరికా యుద్ధ విమానాలు యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై బాంబులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ విమానాలు యెమెన్‌లో దాదాపు 50 లక్ష్యాలను ధ్వంసం చేశాయి. సనా , హొూదైద , అమ్రాన్ నగరాలపై బాంబులు జార విడిచినట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి ఈ దాడులు చోటుచేసుకున్నాయి. -మిగతా 2 లో



## కాంగ్రెస్ ప్రభుత్వం తప్పును సరిదిద్దుకుంటున్నది!

- ఇంద్రవెల్లి బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది
- అమరవీరుల సంస్మరణ సభలో మంత్రి సీతక్క వాగ్దానం

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. -మిగతా 2 లో





# విజన్‌తో పరిపాలన

### ఘనంగా చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలు

- టిటిడి ఆలయంలో ప్రత్యేక పూజలతో ప్రారంభం
- ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి - 75 కిలోల కేక్‌తో సంబరాలు
- తెలంగాణ అభివృద్ధికి చంద్రబాబు పాత్ర అపూర్వం
- హైటెక్ సిటీ నుంచి అమరావతిదాకా -ఒక దూరదృష్టి
- చంద్రబాబు నాయకత్వం మాకు గర్వకారణం అన్న టీడీపీ నేతలు
- యువతకు మార్గదర్శకుడు - ఐటీ విస్తరణకు ఆద్యుడు
- తెలంగాణ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం - వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కార్యకర్తల ఆకాంక్ష


హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవాన్ని తెలంగాణ టీడీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్ వేదికగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పలువురు ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
టిటిడి ఆలయంలో ప్రత్యేక పూజలు
ఉదయం 7 గంటలకు -మిగతా 2 లో



## హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని డిమాండ్

- -రాచరికం మళ్లీ రావాలి..
- -నేపాల్‌లో భారీ నిరసనలు..
- -కాఠ్మాండూలో రోడ్లపైకి వందలమంది

**కాఠ్మాండూ**
నేపాల్‌లో మళ్లీ రాచరిక పాలన రావాలని వందలాది మంది కాఠ్మాండూలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటు, ప్రధాన మంత్రి నివాసం ఉన్న హై సెక్యూరిటీ జోన్ సమీపంలో రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీకి చెందిన దాదాపు 1,500 మంది ధర్నా చేశారు. 'గణతంత్ర విధానం నశించాలి', 'రాచరికం మళ్లీ రావాలి', 'నేపాల్‌ను హిందూ దేశంగా ప్రకటించాలి' అంటూ నినాదాలు చేశారు. -మిగతా 2 లో



## 58వ రోజుకు చేరిన రెస్క్యూ ఆపరేషన్

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**అచ్చంపేట, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న మిగిలిన ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆ ఆరుగురి కోసం 58 రోజులుగా రెస్క్యూ సిబ్బంది అన్వేషణ చేస్తున్నా వారి ఆనవాళ్లు లభించడం లేదు. టన్నెల్‌లో డేంజర్ జోన్ అయిన డీ-1, డీ-2 ప్రదేశం వరకు సహాయక పనులు కొనసాగుతున్నాయి. అక్కడ -మిగతా 2 లో

## నీతీశ్‌ది కుర్చీలాట

(మొదటి తరువాయి)

ప్రసంగించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే సర్కారును అధికారం నుంచి తప్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "బీహార్‌లో నీతీశ్ పార్టీ, భాజపాది అవకాశవాద పొత్తు. రాష్ట్ర ప్రజలకు ఇది మేలు చేకూర్చదు. ముఖ్యమంత్రి పదవి కోసం నీతీశ్ కుమార్ పార్టీలు మారుతుంటారు. మరోవైపు.. ప్రధాని మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారు. బీహార్‌కు ఇస్తామన్న రూ.1.25 లక్షల కోట్ల ప్యాకేజీ హామీ ఏమైంది? ఈ విషయంపై ముఖ్యమంత్రిని రాష్ట్ర ప్రజలు నిలదీయాలి" అని ఖర్గే వ్యాఖ్యానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాగఠ్‌బంధన్'కు ఓటేయాలని, ఎన్డీయే సర్కారును గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జిషీటు నమోదు చేయడాన్ని ఖర్గే ఖండించారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆరోపించారు. తమ నేతలు భయపడరని.. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. పేదలు, మహిళలు, బలహీనవర్గాలకు భాజపా, ఆరెస్సెస్‌లు వ్యతిరేకమని విమర్శించారు. కులమతాల ఆధారంగా సమాజాన్ని విభజించాలని చూస్తాయని, వక్ఫ్ చట్టం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు.

## యెమెన్‌పై అమెరికా బాంబుల వర్షం..

(మొదటి తరువాయి)

తాజా దాడుల్లో హొదైదలోని పోర్టు, విమానాశ్రయం కూడా ధ్వంసమైనట్లు హూతీలు చెబుతున్నారు. తమ దాడులు ఏమాత్రం ఆగవని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కొన్ని రోజుల క్రితమే అమెరికా ఎర్ర సముద్రంలో నౌకాశ్రయంపై చేసిన దాడుల్లో 70 మంది చనిపోయారు. దాదాపు 171 మంది గాయపడ్డారు. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో ఇదే అత్యంత తీవ్రమైంది. ఈ దాడిపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్పందించారు. ఈ చర్యలు తీవ్ర ఆందోళనకరమన్నారు. కాగా హూతీ రెబల్స్ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించడంతో ఈ దాడులు జరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు.

## రాష్ట్రంలో మరో రెండురోజులు వర్షం

(మొదటి తరువాయి)

ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి–భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలు చోట్ల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం కూడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉన్నదని హెచ్చరించింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం తప్పును సరిదిద్దుకుంటున్నది!

(మొదటి తరువాయి)

ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.15 కోట్లతో ఉట్నూర్‌తోపాటు ఏటూరునాగారంలో కొత్తగా ఐటీడీఏ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు. పోడు భూములపై కమిటీ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపి, పట్టాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, ప్రేమ్‌సాగర్ రావు, కోవ లక్ష్మి పాల్గొన్నారు.

## 58వ రోజుకు చేరిన రెస్క్యూ ఆపరేషన్

(మొదటి తరువాయి)

టీబీఎంకు సంబంధించిన స్టీల్, ఇసుప పరికరాలు కటింగ్ చేస్తున్నారు. బండరాళ్లు, స్టీల్ పరికరాలు కట్ చేసి, లోకోట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. డేంజర్ జోన్‌లో ఓవైపు జాగ్రత్తలు తీసుకుంటూ మరోవైపు స్టీల్ కటింగ్ పనులు చేపడుతున్నారు. పైనుంచి సిమెంట్ సెగ్మెంట్లు కూలిపడిపోకుండా సపోర్టు పెట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భారీగా వస్తున్న నీటిఊటను అధిక సామర్థ్యం గల మోటర్లతో బయటకు పంపుతున్నారు. డేంజర్‌జోన్‌గా పేర్కొన్న చివరి ప్రదేశానికి వెళ్లడం అతికష్టంగా మారింది. ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి అక్కడే ఉండి, సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు

## హిందూ దేశంగా నేపాల్‌ను ప్రకటించాలని డిమాండ్

(మొదటి తరువాయి)

ఆర్‌పీపీ చైర్మన్ రాజేంద్ర లింగ్డెన్, సీనియర్ నేతలు పశుపతి షంషేర్ రాణా, మాజీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ధ్రుబ బహదూర్ ప్రధాన్ తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు.ఈ నేపథ్యంలో కాఠ్మాండూలోని కీలక ప్రాంతాల్లో వేలాది మంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. అనుమతిలేని ప్రదేశాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఆర్‌పీపీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. నేపాల్ ప్రతినిధుల సభలో ఆర్‌పీపీ ఐదో అతి పెద్ద పార్టీ. పోలీసులు అరెస్ట్ చేసిన తమ నేతలను వెంటనే విడుదల చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేసింది. తమ నిరసనలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

# జపాన్‌లో తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీ..

(మొదటి తరువాయి)

అత్యంత కాలుష్యంతో ఉన్న నగరమే ఈ కితాక్యూషూ. అక్కడి గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. ఆ నగరం అంతగా ఎలా అభివృద్ధి చెందింది. ఎలాంటి ప్రణాళికలు అమలుచేశారనే వివరాలను తెలంగాణ బృందం తెలుకుంది. మురసాకి రివర్ మ్యూజియంతోపాటు ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌నూ సందర్శించింది రేవంత్ టీమ్. తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగేసింది. జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలైన టెర్న్, రాజ్ గ్రూప్‌లతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాలతో హెల్త్ కేర్‌తోపాటు పలు రంగాల్లో జపాన్ సహకారం విస్తరించనుంది. ఈ ఒప్పందాలతో ఆరోగ్యరంగంలో 200, ఇంజినీరింగ్‌లో 100, టూరిజంలో 100, నిర్మాణరంగంలో 100 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.టోక్యో చేరిన తొలి రోజే జపాన్ పారిశ్రామిక దిగ్గజం మారుబెనీ కార్పొరేషన్‌తో భారీ ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్ సిటీలోని 600 ఎకరాల్లో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఈ సంస్థ అభివృద్ధి చేయనుంది. ప్రారంభ దశలోనే వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడి



పెట్టేందుకు సిద్ధమైంది. ఈ పార్క్ ద్వారా మరిన్ని జపాన్, మల్టీనేషనల్ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ ద్వారా 5 వేల కోట్లకుపైగా పెట్టుబడులు.. 30 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించబడే అవకాశం ఉందని ప్రభుత్వం చెప్తోంది. టోక్యోలోని సోనీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. అనుబంధ సంస్థ అయిన క్రంచిరోల్ టాప్ ఎగ్జిక్యూటివ్‌లతో రేవంత్ భేటీ అయ్యారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాల్లో హైదరాబాద్‌ను హబ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం ప్రతిపాదించారు. అలాగే, టోక్యోలోని జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మెట్రో ఫేజ్–2, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, రీజనల్ రింగ్ రోడ్డు లాంటి మెగా ప్రాజెక్టులకు రూ.11వేల 693 కోట్ల విదేశీ రుణం ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ నగరాన్ని టోక్యో తరహాలో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టులు మైలురాయిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# విజన్‌తో పరిపాలన






(మొదటి తరువాయి)

జూబ్లీహిల్స్‌లోని టిటిడి ఆలయంలో చంద్రబాబు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన కుటుంబసభ్యుల పేర్లతో కూడిన ఆరాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పుష్పాంజలి అర్పించారు.

**ఎన్‌టిఆర్ భవన్ వద్ద భారీ కేక్, టపాకాయలు**

పూజా కార్యక్రమాల అనంతరం ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో 75 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి వేడుకల శు భారంభం చేశారు. టపాకాయలు కాల్చి ఉత్సాహాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమానికి టిటిడి బోర్డు సభ్యుడు, జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అధ్యక్షత వహించారు.

**"విజన్ 2020" నుంచి "విజన్ 2047" దిశగా చంద్రబాబు ప్రయాణం**

ఈ సందర్భంగా పలువురు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రసంగిస్తూ చంద్రబాబు దూరదృష్టిని కొనియాడారు.

–బక్కని నర్సింహులు మాట్లాడుతూ, "స్వామి వివేకానంద చెప్పిన ఐదు ప్రధాన సమస్యలను ఎదుర్కొనే నాయకుడు భారతదేశంలో చంద్రబాబే," అని అన్నారు.

–సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ తలసరి ఆదాయంలో నెంబర్‌వన్‌గా నిలవడంలో చంద్రబాబు పాత్ర అపూర్వమైనది," అని గుర్తు చేశారు.

–అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "హైటెక్ సిటీ రూపకల్పనలో చంద్రబాబు దృక్పథం యువత ఉపాధికి మార్గం వేసింది," అన్నారు.

–మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ పేర్కొంటూ, "అమరావతికి 'విజన్ 2047' ద్వారా పునాది వేసిన నాయకుడు చంద్రబాబు," అని వ్యాఖ్యానించారు.

'నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి" – కార్యకర్తల ఆకాంక్ష

ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. నాయకురాలు నందమూరి సుహాసిని మాట్లాడుతూ, "లాంగ్ లీవ్ చంద్రబాబు, జై చంద్రబాబు" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

ఈ కార్యక్రమంలో జాతీయపార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, ఎన్‌టిఆర్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్, సీఓఓ గోపి, రాష్ట్ర పార్టీ నాయకులు నెల్లూరి దుర్గాప్రసాద్, క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వేంకటేశ్వర్లు, లీగల్ సెల్ నాయకులు అండేకార్ యాదిలాల్,తాళికోట హరికృష్ణ, అజ్మీరా రాజునాయక్, శ్రీనివాసా నాయుడు, సూర్యదేవర లత, మ్యాడం రామేశ్వర్‌రావు, డాక్టర్ ఏ.ఎస్.రావు, పోలంపల్లి అశోక్ కుమార్, కె. గోపి, గజేంద్ర కుమార్, వెలివెల దుర్గారావు, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రత్నాకర్‌రావు, యాదిలాల్, కడియాల రాజేందర్, వేణుగోపాల్, పర్లపల్లి రవీందర్, జివిజి నాయుడు, మోహన్, గూడెపు రాఘవులు, మహానంది శ్రీశ్కెలం తదితరులు పాల్గొన్నారు.మల్కాజ్‌గిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీలో 3038 ఉద్యోగాల భర్తీ..

–ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో కొంత ఆలస్యం
–సాధ్యమైన తొందరగా భర్తీ ప్రక్రియ పూర్తి
–త్వరలో నోటిఫికేషన్: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) త్వరలోనే ఆర్టీసీలో 3038 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో హర్షం వ్యక్తం చేశారు. 3038 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాలను భర్తీ చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన, ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నదని చెప్పారు. దీని ద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని వెల్లడించారు. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం



చేశారని, వారు రూ.5500 కోట్లు ఆదా చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి కోసం కొత్త బస్సులను కొనుగోలు చేశామని, ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని పేర్కొన్నారు.

డ్రైవర్–2000
శ్రామిక్–743
డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్)– 84
డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్)– 114
డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్– 25
అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్– 18
అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్)– 23
సెక్షన్ ఆఫీసర్ ( సివిల్)–11
అకౌంట్ ఆఫీసర్స్– 6
మెడికల్ ఆఫీసర్స్ జనరల్– 7
మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్– 7

ఈ పోస్టులను త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనుంది. ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వం లో నిరుద్యోగులకు పెద్ద పీఠ వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లు క్యాలండర్ ప్రకారం విడుదల చేయనుందని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండడంతో సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## తెలుగు పంచాంగం 21/4/2025,సోమవారం



సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:59 AM
సూర్యాస్తమయం: సాయంత్రం 6:29 PM
చంద్రోదయం - చంద్రాస్తమయం
చంద్రోదయం: రాత్రి 12:50 AM
చంద్రాస్తమయం: మధ్యాహ్నం 12:16 PM
తిథి
అష్టమి: ఏప్రిల్ 20 సాయంత్రం 7:01 PM నుండి ఏప్రిల్ 21 సాయంత్రం 6:58 PM వరకు
నవమి: ఏప్రిల్ 21 సాయంత్రం 6:58 PM నుండి ఏప్రిల్ 22 సాయంత్రం 6:13 PM వరకు
నక్షత్రం
ఉత్తరాషాఢ: ఏప్రిల్ 20 ఉదయం 11:48 AM నుండి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 12:37 PM వరకు
శ్రవణం: ఏప్రిల్ 21 మధ్యాహ్నం 12:37 PM నుండి ఏప్రిల్ 22 మధ్యాహ్నం 12:44 PM వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:33 AM నుండి 9:07 AM వరకు
యమగండం: ఉదయం 10:41 AM నుండి మధ్యాహ్నం 12:14 PM వరకు
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12:39 PM నుండి 1:29 PM వరకు, మధ్యాహ్నం 3:09 PM నుండి 3:59 PM వరకు
వర్జ్యం: సాయంత్రం 4:38 PM నుండి 6:14 PM వరకు
శుభ సమయాలు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:49 AM నుండి 12:39 PM వరకు
అమృతకాలం: ఉదయం 6:00 AM నుండి 7:39 AM వరకు, రాత్రి 2:17 AM నుండి 3:53 AM వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:22 AM నుండి 5:10 AM వరకు

## రాహుల్ గాంధీపై బీజేపీ రాజకీయ కుట్ర



**ఆమనగల్లు, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద, నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ నాయకులు సోనియా గాంధీ మరియు రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఖండిస్తూ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "నేషనల్ హెరాల్డ్ కేసులో మా నాయకులపై ఈడీ చార్జ్‌షీట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజల కోసం త్యాగాలు చేసిన కుటుంబం మీద మోడీ రాజకీయంగా ఎదుర్కోలేక, అసలైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక, ఈ కుట్రలకు పాల్పడుతున్నారు. ఇది బీజేపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ ప్రతీకారం," అని అన్నారు. "రాహుల్ గాంధీ ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ, బీజేపీ వైఫల్యాలను బహిర్గతం చేస్తున్నారు. అందుకే ఈ అక్రమ కేసులతో వారిని లక్ష్యంగా చేస్తున్నారు," అని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్, ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, విఠయిపల్లి మాజీ సర్పంచ్ పర్వతాలు, పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఖాదర్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కండె సాయి, రఫీ, మల్లెపాకుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిగొండ గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం






**దేవరకొండ, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ అంగన్వాడి కేంద్రంలో శనివారం జరిగిన పోషణ పక్షం కార్యక్రమం సాదరంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ డి.చిట్టెమ్మ, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోతిలాల్, ఎల్లయ్య మరియు అంగన్వాడి టీచర్లు విజిత, రమణ, జయలక్ష్మి, అరుణ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించడం జరిగింది. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, సిరిధాన్యాలు, చిరుధాన్యాలలో ఉన్న పోషక విలువలను వివరించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు, ఆటవస్తువుల ప్రదర్శన ద్వారా తల్లులకు అవగాహన కల్పించడమేకాకుండా పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు నిండిన పాప అయిన ఎస్.కె అలియా అనే చిన్నారికి అక్షరాభ్యాసం చేయించడం విశేషం. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంగన్వాడి కేంద్రం అందించే సేవలు, పోషణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలు వివరించడం అందరికి ఉపయోగకరంగా మారింది.

## ఘనంగా ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు.


**జగిత్యాల టౌన్,**
జగిత్యాల నియోజకవర్గం కేంద్రంలోని టవర్ సర్కిల్ వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంటు అడా హాక్ కమిటీ సభ్యులు సోమ నారాయణరెడ్డి మాట్లాడుతూ టిడిపి అధినేత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన పార్టీ తెలుగుదేశం అని చంద్రబాబు దూరదృష్టి తో రూపొందించిన



పాలనతో తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసిందని అన్నారు. చంద్రబాబు నాయుడు పరిపాలనలో వారి నాయకత్వంలో హైదరాబాదు అంతర్జాతీయ ఐటీ కేంద్రంగా అభివృద్ధి చెందిందని హైటెక్ సిటీ సైబర్ టవర్స్ నిర్మాణము ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు లభించడం జరిగింది వేరే రాష్ట్రాల నుంచి కూడా యువతకు హైదరాబాదు ఉపాధి అవకాశాలకు కేంద్రముగా మారింది అనేక సమక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించడం జరిగిందని చెప్పారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకిపూర్వవైభవం తీసుకువచ్చి తెలంగాణలో కూడా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పనిచేస్తూ ప్రజలతో మమేకమై ఉంటారు ఇట్టి కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు కొండ శ్రీధర్, మగ్గిడి గంగాధర్, జున్ను మల్లయ్య,మొర గణేష్, బొల్లారం రాజేష్,గోనె భూమేశ్వర్, నక్క లక్ష్మారెడ్డి, కల్లెడ రాజారెడ్డి,నేరెళ్ల జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ తోనే మహేశ్వరం భవిష్యత్తుకు బాటలు.

**-మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరుతూ త్వరలోనే మహేశ్వరంలో భారీ బహిరంగ సభ.**
**-మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ సీనియర్ జర్నలిస్టు వత్తుల రఘుపతి.**



**మహేశ్వరం, ఏప్రిల్ 20,**
ఫ్యూచర్ సిటీ తోనే మహేశ్వరం భవిష్యత్తుకు బాటలు వేయాలని మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ సీనియర్ జర్నలిస్టు వత్తుల రఘుపతి అన్నారు. ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలోని కర్నాటి కళాభవన్ లో జరిగిన ఫ్యూచర్ సిటీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపకపోతే మహేశ్వరం భవిష్యత్తు అంధకారం లోకి నెట్టి వేయబడుతుంది ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపేవరకు గ్రామ, గ్రామాన చైతన్య కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. త్వరలోనే బహిరంగ సభ ద్వారా మహేశ్వరం మండల ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి చాటే విధంగా ఒక సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ నేత, ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరి గౌడ్, నాయకులు కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, ఆంధ్యానాయక్, జగన్ రెడ్డి, సుభాష్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్లు మండలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు రాజీవ్ గాంధీ చౌరస్తాలో ప్రారంభమై, శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. పార్టీ ముఖ్య నాయకులు కేక్ కట్ చేసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కండె భాస్కర్,పార్లమెంట్ ప్రథమ కార్యదర్శి కొప్పు యాదయ్య, మారేపల్లి జంగయ్య, పాండు నాయక్, నరేష్ యాదవ్, మణికంఠ, లక్ష్మీపతి, సత్యం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంబేద్కర్ యాదిలాల్ శుభాకాంక్షలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఆదివారం హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ కార్యక్రమంలో పాల్గొన్న యాదిలాల్ మాట్లాడుతూ, "చంద్రబాబు జీవితం ప్రజాసేవకు అంకితమై ఉంది. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను," అని తెలిపారు. చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి పనులను ప్రశంసిస్తూ, "హైదరాబాదును దేశంలో నెంబర్ వన్ నగరంగా నిలిపిన ఘనత ఆయనదే," అని కొనియాడారు. ఈ వేడుకలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ కనకమేడల రవీందర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి ఆవు మృతి..



**కేశంపేట, ఏప్రిల్20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన బడక సత్యనారాయణ పాడి ఆవు పిడుగుపాటుకు గురై చనిపోయింది. ఆదివారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. మెరుపులతో పిడుగు పడడంతో వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింద ఉన్న సత్యనారాయణ ఆవు ఒక్కసారిగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృత్యు వాత పడింది. బడక సత్యనారాయణ రూ. 80వేలతో ఆవు ను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నట్లు తెలిపాడు. పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆయనకు పాడి ఆవు మృతితో జీవనం కోల్పోయినట్లుంది. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి తనను ఆదుకోవాలని పాడి రైతు వేడుకుంటున్నారు...

## ఘనంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**నకిరేకల్ ఏప్రిల్ 20 ఏప్రిల్20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేలాదిగా తరలివచ్చిన చిరుమర్తి అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు నార్కట్ పల్లి మండల కేంద్రంలోని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిరుమర్తి లింగయ్య గారి పుట్టిన రోజు సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండనరేందర్ రెడ్డి గారు నకిరేకల్ నియోజకవర్గ జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు

# అంబేద్కర్ జయంతోత్సవాల్లో భాగంగా ప్రముఖులను కలిసిన బీజేపీ నేతలు...



**అంబర్ పేట్, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతోత్సవాల్లో భాగంగా భారత ప్రభుత్వం నరేంద్ర మోడీ అభివృద్ధిలో భాగంగా ఈరోజు కొంతమంది ప్రముఖులను డాక్టర్స్, జాయింట్ కలెక్టర్, కాలనీ ప్రెసిడెంట్, సిఐ, చార్టెడ్ అకౌంట్, సివిల్ ఇంజనీర్ ఇలా అనేకమంది పెద్దలను కరపత్రమిస్తూ కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి అంబర్పేట్ అసెంబ్లీ శ్యామ్ రాజు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎడెల్లి అజయ్ కుమార్, బాగ్ అంబర్పేట్ డివిజన్ అధ్యక్షులు చుక్కా జగన్, అంబేద్కర్ ఉత్సవ అంబర్పేట్ కన్వీనర్ వర్కాల శ్రీకాంత్, బిజెపి నాయకులు అంబేద్కర్ ఉత్సవ బాగ్ అంబర్పేట్ కన్వీనర్ గుగ్గిళ్ళ శ్రీనివాస్, బిజెపి నాయకులు ధనంజయ, శివ, విజయ్ శేఖర్, అనేకమంది పాల్గొనడం జరిగింది.

# రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రచారం




**వెల్దండ, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాచూరు గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ, "బీజేపీ ప్రభుత్వం కుల, మత, ప్రాంత భేదాలతో ప్రజలను విభజించి అభివృద్ధిని భ్రష్టు పట్టిస్తోంది," అని ఆరోపించారు. ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. 'బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి," అని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో పర్వత్ రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్, తక్కెళ్ళపల్లి శేఖర్, కొయ్యల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వంగూర్ సమీపంలో ఘోర ప్రమాదం

## - ఒకరు మృతి



**వంగూర్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూర్ మండల కేంద్రానికి సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ మెహిదీపట్నానికి చెందిన జావేద్ (32), అతని మిత్రుడు ఇమ్రాన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నారు. వంగూర్ సమీపానికి రాగానే ఒక్కసారిగా వారి బైకు పేలిపోవడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో జావేద్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇమ్రాన్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న వంగూర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. వంగూర్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రాథమికంగా ఇది వాహనంలో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల జరిగిన ప్రమాదంగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కలిసిన నాయకులు



**వెల్దండ, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాదులోని హైదర్ గూడా ఎమ్మెల్యే క్వార్టర్‌లో విశ్రాంతి తీసుకుంటున్న నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శేఖర్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, మాజీ సర్పంచ్ రాములు యాదవ్ తదితరులు డాక్టర్ వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటకి తీయటం కోసం, నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ సంప్రదించండి.
అన్ని వేళాల మీతో పాటు ఉంటుంది.
ఈమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# 51శాతం ఫిట్మెంట్ తో పీఆర్సీ అమలు చేయాలి.




సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్టిఎఫ్ అడ్వైజర్ మరియు మాజీ ప్రధాన కార్యదర్శి గవిని రామ్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్టిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్ మారెడ్డి అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్టిఎఫ్ చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులు ఉప్పు సత్యనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వైఎస్ ప్రెసిడెంట్, టిఆర్టిఎఫ్ రాష్ట్ర మాజి అధ్యక్షులు కావలి అశోక్ కుమార్

-పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.
-కరువు భత్యాలను (డీఏ )విడుదల చేయాలి....
-తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) రాష్ట్ర కార్యవర్గ డిమాండ్ ...

**హైదరాబాద్, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లందరికీ తెలంగాణ రెండవ వేతన సవరణ కమిషన్ రిపోర్టును త్వరితగతిన తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్ తో అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ టిఆర్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డిలు కోరారు. ఆదివారం రోజు హైదరాబాద్ లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ హాలులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి కార్యదర్శి నివేదికపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ 2023 జూలై మాసం నుండి అమలు కావలసిన వేతన సవరణ 2025 సంవత్సరం నాటికి కూడా అమలు కు నోచుకోలేకపోవడం శోచనీయమని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణను వెంటనే చేపట్టాలని కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. దేశంలోనే 5 డిఏలు పెండింగ్ ఉన్న రాష్ట్రం మరొకటి లేదని, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన డి ఏ లు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కార్యవర్గం కోరింది. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల అనేక బిల్లులు మంజూరు కాబడి కూడా నగదు పొందలేని స్థితిలో ఈ కుబేర్ లో పెండింగ్లో ఉన్నదని వాటన్నింటి వెంటనే విడుదల చేయాలని కోరారు. రిటైర్మెంట్ తర్వాతనైనా అప్పుల చెల్లింపు, పిల్లల పెళ్లిళ్లకు లేక స్వగృహ కాంక్ష నెరవేర్చుకుందాం అనుకున్న పెన్షనర్ల కలను ఈ-కుబేర్ కొల్లగొట్టిందని, ఈ-కుబేర్ ను రద్దుచేసి గతంలో వలె నేరుగా బ్యాంకుల ద్వారా చెల్లింపు విధానాన్ని పునరుద్ధరించాలని కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. పాఠశాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తుందని దానికి అనుగుణంగా ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు పదోన్నతులు చేపట్టాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రభుత్వం పేర్కొన్నందున ప్రతి సంవత్సరం వేసవిలో నియామకాలు, బదిలీలు, పదోన్నతులు ఉండేలా క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కార్యవర్గం కోరింది. పాఠశాల పరిశుభ్రతకు చాలా జిల్లాలలో మూడు మాసాలే బడ్జెట్ కేటాయించారని, మిగతా మాసాలకు బడ్జెట్ ను విడుదల చేయాలని పాఠశాల పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ ప్రభుత్వం తీసుకోవాలని కార్యవర్గం కోరింది. టీజీఇ జెఎసి రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన 57 డిమాండ్ల ప్రాతినిధ్యాన్ని పరిష్కరించాలని ప్రభుత్వానికి కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ నుండి సానుకూల స్పందన లేకుంటే ఉద్యమ కార్యక్రమాలకు సంసిద్ధం కావాలని, జూన్ 9న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన టీజీఇ, జేఏసి మహా ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద ఎత్తున కదిలి వచ్చి మన సంఘటిత శక్తిని ప్రభుత్వానికి చాటి మన డిమాండ్లను నెరవేర్చుకోవాలని రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్లకు కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈ కార్యవర్గ సమావేశంలో సంఘ చీఫ్ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, ఐఫియా ఉపాధ్యక్షులు కావలి అశోక్ కుమార్, రాష్ట్ర సబ్ కమిటీ కటకం రవికుమార్, గవిని రాంరెడ్డి, మహేందర్ రాజ్, ఎ.కిరణ్ జ్యోతి, సాయిబాబు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

# సీనియర్ జర్నలిస్టుకు నాగరాజుకు జర్నలిస్టుల ఘన నివాళి...

**-ఆపదలో ఉన్న జర్నలిస్టులను ఆదుకోవాలి**
**-జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలి**
**-నాగరాజు సంతాపసభలో జర్నలిస్టు యూనియన్ నేతలు..**






**హైదరాబాద్, ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్రంలో నిరంతరంగా కొనసాగుతున్న జర్నలిస్టుల ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలను నివారించేలా తగు చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ యూనియన్ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను యాజమాన్యాలు పరిష్కరించకపోవడం వల్లనే ఫలితంగా అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయగాన సభలో జరిగిన దివంగత సీనియర్ జర్నలిస్టు యడ్లపల్లి నాగరాజు సంతాప సభలో ఆయనతో ఆంధ్రజ్యోతిలో పనిచేసిన ఒకప్పటి సమకాలీన జర్నలిస్టులు సంతాప సభలో పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ ల నేతలు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని వారు కోరారు. ఏళ్ళతరబడి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వకపోవడం, సరైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించకపోవడం వల్ల ఎంతో మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకోవడం, అనారోగ్యంతో మరణించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన పదేళ్లలో నాగరాజు లాంటి జర్నలిస్టులు వందల సంఖ్యలో చనిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టుల సంక్షేమానికి నూతన పాలసీ తీసుకువచ్చి సంక్షేమ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య ఆరోగ్య సదుపాయం కల్పిస్తూ హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఆర్థిక,ఆరోగ్య సమస్యలతో ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దాదాపు మూడున్నర దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పనిచేసిన యడ్లపల్లి నాగరాజు నిబద్ధత కలిగిన నికార్సయిన జర్నలిస్టు అని ఆయన కొనియాడారు. ఒకవైపు జర్నలిజం వృత్తిలో విలువలకు ప్రాధాన్యమిస్తూనే మరోవైపు జర్నలిస్టుల సమస్యలపై పోరాడిన నాగరాజు మరణం జర్నలిజం వృత్తికి, జర్నలిస్టులకు తీరని లోటు అని అన్నారు. ఈ సంతాపసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, పూర్వం నాగరాజుతో కలిసి పనిచేసిన సహ పాత్రికేయులు ఉప్పు సత్యనారాయణ, జే.పద్మారావు, మోహన్ రావు, జగన్ రెడ్డి, యుగంధర్, పొగాకు బాలకృష్ణ, రమేష్, జీహెచ్ జె హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ యర్రమిల్లి రామారావు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.పాండురంగారావు, ఫోటో జర్నలిస్టులు శ్రీధర్, రహీం, పర్వతాలు తదితరులు పాల్గొని దివంగత నాగరాజుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత జర్నలిస్టు నాగరాజు క్రమశిక్షణ,నిబద్ధత కలిగిన జర్నలిస్టు అని, ఎవరికీ తలవంచని నిగర్వి అని అన్నారు. నాగరాజు మరణంతో తాము ఓ మంచి జర్నలిస్టు మిత్రుడిని కోల్పోయామని అన్నారు.

## చెట్టు = అమ్మ
## చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.


**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# జేఈఈ మెయిన్స్ లో ఫలితాలలో గుండాల ఏకలవ్య విద్యార్థుల ప్రభంజనం








**వెల్దండ,ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఎన్ టి ఏ వారు తాజాగా విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ 2025 పరీక్ష ఫలితాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు కే సుశాంత్ ( 89.8 శాతం) ఈ చరణ్ ( 76.7 శాతం ) కే సురేష్( 71.6 శాతం) జె సిద్దు ( 49.8 శాతం) పర్సంటే ల్ తో అర్హత సాధించారని అదేవిధంగా కే సుశాంత్ ( 89.8 శాతం) పర్సం టైల్ తో ఎస్ టి కేటగిరిలో ఆల్ ఇండియా 1532 ర్యాంకు సాధించాడని ప్రిన్సిపల్ ప్రదీప్ కుమార్ తెలిపారు.

# ఘనంగా కరుణాకర్ గౌడ్ స్వప్నల వివాహ మహోత్సవం

**-ముఖ్య అతిథిగా ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ప్రముఖుల సందడి**











**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర పూర్వ సంఘటన మంత్రి కరుణాకర్ గౌడ్ -స్వప్నల వివాహ మహోత్సవం శనివారం నాగర్‌కర్నూల్‌లోని వంశీ కన్వెన్షన్ హాల్లో అత్యంత వైభవంగా జరిగింది. వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆనందమయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్, పార్టీ నేతలు విష్ణువర్ధన్ రెడ్డి, గుంత లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధులు దిలీపాచారి, కట్ట సుధాకర్ రెడ్డి, సోలంకి శ్రీనివాసులు, జక్కా రఘునందన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేంద్ర రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎల్లెని సుధాకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల్ దాస్ రామ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ సీనియర్ నేతలు యాదగిరి రావు, నాగేంద్ర గౌడ్, తిరుపతి, టౌన్ జనరల్ సెక్రటరీ చెవ్వ ప్రమోద్ కుమార్, తాడూరు జనరల్ సెక్రటరీ సుదర్శన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఇతర ఏబీవీపీ, బీజేపీ నాయకులు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. పెళ్లి వేడుక కళకళలాడగా, వధూవరులు మంగళవాయిద్యాల నడుమ మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు నూతన దంపతులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ తన బాల్య కాలపు పాఠశాలకు వెళ్లి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తన పాత ఇంటి వద్ద కొన్ని స్మృతులను గుర్తుచేసుకుంటూ, ఫొటోలు దిగుతూ ఆ తరుణాన్ని ఆస్వాదించారు. "ఇవన్నీ జీవితాంతం గుర్తుండిపోయే మధుర క్షణాలు," అని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు.

## అర్బన్ పార్క్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే డాటీ రాంమోహన్ రెడ్డి**







**పరిగి ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పరిగి మండలం జాఫర్ పల్లి గ్రామంలో 4కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన అర్బన్ పార్క్ లో పరిగి వాకర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఈరోజు ఉదయం పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ అర్బన్ పార్క్ ను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి రోజు ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఇది శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరుస్తుందని రోగాలను నివారిస్తుందని అన్నారు.

## గండీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట



**జగిత్యాల, ఏప్రిల్ 20 (సారంగాపూర్) ఏప్రిల్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని గండీ వెంకటేశ్వర్ల నూతన దేవాలయానికి గోపుర శిఖర ప్రతిష్ట తోపాటు గండీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు. రామాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగా వైభవంగా కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేయగా గ్రామ ఆటో,టాటా ఏసీ యూనియన్ సభ్యులు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# పడవకు నిప్పంటుకుని 143 మంది మృతి

**-కాంగోలో వందల మందికి గాయాలు**

**కిన్హాసా, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చమురును తీసుకుని వస్తున్న భారీ పడవలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని బోల్తా పడటంతో 143 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. ఆ దేశ అధికారులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15న వందలాది మంది ప్రయాణికులతో పాటు చమురును తీసుకుని వస్తున్న భారీ చెక్క పడవకు కాంగో నదిలో ఈక్వాటార్



ప్రావిన్స్ రాజధాని మబండాకాకు సమీపంలో హఠాత్తుగా నిప్పంటుకుంది. అనంతరం పేలుడు సంభవించడంతో చాలా మంది సజీవ దహనమయ్యారు.కొంతమంది ప్రాణ భయంతో నీటిలోకి దూకేశారు. ఇంతవరకు 143 మృతదేహాలను వెలికి తీశామని, చాలా మంది మృతదేహాలు బొగ్గులా మారాయని అధికారులు తెలిపారు. పడవలో వంట కోసం నిప్పంటించేటప్పుడు జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఈ దేశంలో కొన్ని నగరాలు, పట్టణాలకు తప్ప మిగిలిన చోట్లకు రోడ్డు, విమాన సౌకర్యాలు అంతగా లేవు. దాంతో చాలా మంది నదుల మీదుగా పయనిస్తుంటారు.

## సెల్‌ఫోన్‌కే ఎప్‌సెట్ ఫలితాలు


**రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఫలితాలు పంపించేలా ఏర్పాటు**



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** టీజీ ఎప్‌సెట్ ఫలితాలను విద్యార్థులు దరఖాస్తు సమయంలో రిజిస్టర్డ్ చేసుకున్న సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించేలా జేఎన్టీయూ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు ఈనెల 29 నుంచి మే నెల 4 వరకు జరగనున్నాయి. ఈసారి 3.05లక్షల మంది విద్యార్థులు ఎప్‌సెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత 10రోజుల్లో ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటివరకు ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఈసారి విద్యార్థుల సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించాలని నిర్ణయించారు. దీంతో అభ్యర్థులకు వెబ్‌సైట్‌లో వెతకాల్సిన తిప్పలు తప్పుతాయి.

## నాన్ న్యూక్లియర్ హైడ్రోజన్ బాంబు!

**-రెండు సెకన్లలో 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత**
**-విజయవంతంగా పరీక్షించిన చైనా**



**బీజింగ్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దక్షిణ చైనా సముద్ర జలాలపై ఆధిపత్యం కోసం తపిస్తున్న చైనా.. హైడ్రోజన్ బాంబ్ (నాన్-న్యూక్లియర్)ను విజయవంతంగా పరీక్షించింది. తైవాన్‌కు అమెరికా రక్షణ మద్దతు పెరుగుతున్న క్రమంలో ఆ దేశం హైడ్రోజన్ బాంబు పరీక్షలను చేపట్టినట్లు తెలుస్తున్నది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం, పూర్తిగా శుద్ధి చేసిన 2 కిలోగ్రాముల హైడ్రోజన్ బాంబును ఆ చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ అనే సంస్థ అభివృద్ధి చేసింది. సంప్రదాయ అణు బాంబుల మాదిరిగా కాకుండా మెగ్నీషియం హైడ్రేడ్‌తో ఈ నాన్-న్యూక్లియర్ హైడ్రోజన్‌ను తయారుచేసింది. ఇది చాలా శక్తివంతమైన బాంబు. ఒక్కసారి యాక్టివేట్ అయితే, కేవలం రెండు సెకన్లలో 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కూడిన పేలుడు సంభవిస్తుంది. ఒకేవిధమైన శక్తిని విడుదల చేసే ఫైర్‌బాల్స్ విడుదలవుతూ.. వరుస పేలుళ్లు సంభవిస్తాయి. దీంతో విస్తారమైన ప్రదేశంలోని శత్రు సేనల్ని, వాటి స్థావరాల్ని ఇది సర్వనాశనం చేస్తుంది.

# ఢిల్లీ పెద్దలపై కాంగ్రెస్‌లో ధిక్కార స్వరాలు!

**-జై బాపు.. కార్యక్రమంపై అనాసక్తి**
**-రాష్ట్ర సమస్యలపై అధిష్ఠానం దృష్టి పెట్టడంలేదని అసంతృప్తి**
**-బీజేపీపై ఆందోళనలు చేస్తే ప్రయోజనమేంటని అభిప్రాయం**
**-గాంధీభవన్‌లో ముఖ్య నేతలు, కార్యకర్తల మధ్య పెద్దఎత్తున చర్చ**



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్‌లో ఢిల్లీ పెద్దలపై అడుగడుగున ధిక్కార స్వరాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇటీవలే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌పై ముఖ్యనేత వర్గం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి అదే తరహా పరిస్థితి కనిపిస్తున్నదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం జాతీయస్థాయిలో పిలుపునిచ్చిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్..' కార్యక్రమాన్ని అమలు చేసే విషయంలో రాష్ట్ర పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. ఎన్డీఏ సరార్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని 'జై బాపు..' కార్యక్రమాన్ని ఏఐసీసీ తలపెట్టింది. కానీ ర్యాలీలతో పెద్దగా ఉపయోగం ఉండదంటూ రాష్ట్ర నాయకత్వంలో అభిప్రాయం వ్యక్తమవుతున్నట్టు పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. ఏది ఏమైనా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాల్సిందేనని అధిష్ఠానం ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు రెగ్యులర్‌గా జూమ్ మీటింగ్‌లు పెట్టి ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**బలవంతంగా రుద్దుతారెందుకు?**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నదని, ప్రభుత్వాన్ని, పార్టీని సమస్యలు వేధిస్తున్నాయని రాష్ట్ర నేతలు చెప్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు, ప్రతిపక్షాలు ఎండగడుతున్నాయని వాపోతున్నారు. వాటిని తిప్పికొట్టడమే పెద్ద తలనొప్పిగా మారితే, ర్యాలీలు చేయాలంటూ ఢిల్లీ నుంచి ఒత్తిడి చేయడమేంటని కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యంతో ఎమ్మెల్యేలు, నేతలు గుర్రుగా ఉన్నారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తెలంగాణలో పెద్దగా ప్రభావం లేని బీజేపీ గురించి జనంలో చర్చ పెట్టడం వల్ల ప్రయోజనమేంటని మరికొందరు కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నట్టు సమాచారం.

# మహా కుంభమేళాను రాజకీయ కుంభమేళాగా మార్చిన బీజేపీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ సర్కార్‌పై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రధానిగా ప్రమోట్ చేసేందుకు రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన మహా కుంభమేళాను రాజకీయ కుంభమేళాగా బీజేపీ వాడుకుందని విమర్శించారు సామాజిక విభజనను, సీఎం యోగి ఆదిత్యను ప్రోత్సహించడానికి చేసిన తతంగంగా



ఆయన దీనిని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రెండు మతాల మధ్య చిచ్చును రేపుతున్నదని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే విమర్శలపై అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. 'దేశ ప్రధాని పదవికి సీఎం యోగి పేరును తీసుకొచ్చేందుకు బీజేపీ మహా కుంభమేళాను వాడుకుంది. కులం పేరుతోవిభజన తీసుకురావటం బీజేపీ ప్రణాళికాబద్ధమైన కార్యక్రమం' అని విమర్శించారు.


## డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం : చిరంజీవి



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం అని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. తెలంగాణలోని టీవర్క్స్ వద్ద నోటి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి వర్చువల్ సందేశం పంపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం చేయిచేయి కలుపుదామన్నారు. వ్యసనాలకు బానిసలై కొందరు తమ కలలను దూరం చేసుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాల కట్టడిపై ప్రభుత్వంతో పాటు అందరం అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు.

## హసీనాను రప్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం..

**ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన బంగ్లాదేశ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత్ లో తలదాచుకుంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ను స్వదేశానికి రప్పించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. హసీనాతోపాటు 12 మందిని తమ దేశానికి తీసుకొచ్చేందుకు బంగ్లాదేశ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వారి కోసం రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్‌పోల్‌ను బంగ్లాదేశ్ నేషనల్ సెంట్రల్ బ్యూరో పోలీసులు కోరారు.కాగా 77 ఏళ్ల షేక్ హసీనా పదవీచ్యుతురాలు అయ్యాక భారత్‌కు వచ్చి తలదాచుకుంటున్నారు. గత ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి ఆమె భారత్‌లో ఉంటున్నారు. కోర్టుల్లో అప్పీళ్లు, దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగా షేక్ హసీనాను స్వదేశానికి రప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని బంగ్లాదేశ్ అధికారులు చెప్పారు.

## అమెరికాకు మహా మాంద్యం ముప్పు

**2008 నాటి మాంద్యాన్ని మించిన సంక్షోభం**
**బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు రే డాలియో**



**వాషింగ్టన్ ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమెరికా ఆర్థిక వ్యవస్థ పట్ల బ్రిడ్జివాటర్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు, బిలియనీర్ రే డాలియో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2008 నాటి ఆర్థిక మాంద్యం తీవ్రతకు మించిన ఆర్థిక సంక్షోభం ముప్పు కనిపిస్తున్నదని హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి కారణం కొంత వరకు ట్రంప్ దూకుడుగా అమలు చేస్తున్న వాణిజ్య విధానాలేనని చెప్పారు. చైనా నుంచి అమెరికాకు ఎగుమతులపై విధిస్తున్న టారిఫ్‌ల ప్రభావం చాలా ముఖ్యమైనదని తెలిపారు. ప్రధాన ఆర్థిక, రాజకీయ, భౌగోళిక రాజకీయ వ్యవస్థలు చెడిపోవడాన్ని చూస్తున్నామని, ఆర్థిక స్థిరత్వాన్ని చెప్పుకోదగ్గ స్థాయిలో దెబ్బతీసే అత్యంత అరుదైన సంఘటనగా దీనిని పరిగణించవచ్చున్నారు.

## చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన వారి జీవితం ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు దేవుడు వారికి మరింత శక్తినివ్వాలని కేసీఆర్ కోరుకున్నారు. చంద్రబాబు నాయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సౌఖ్యాలతో ప్రజాసేవలో మమేకం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.